## గోడ గడియారం

తొమ్మిది గంటలు కొట్టింది.

అంతవరకు ఎంతో హుషారుగా కబుర్లు చెప్పిన వాసంతి చెల్లెలు — "నాకు నిద్రవస్తొందక్కా. పోయి పడుకుంటాను" అని లోపలికి వెళ్ళిపోయింది.

వాసంతీ, ఆమె తల్లీ మిగిలారు.

వాసంతి తల్లి కూడా ఆవులింతమీద ఆవులింత తీసుకురాగా — "అల్లుడుగా రింకా రాలే దేమిటమ్మా?" అని అడిగింది ఆశ్చర్యంగా.

చిన్నగా నవ్వింది వాసంతి. "ఇంకా తొమ్మిదే కదమ్మా అవుత!"

"అంటే, రోజూ ఇంతేనా?"

"మీ అల్లుడుగారు చేసే ఉద్యోగం ఏమిటనుకున్నావమ్మా! బడిపంతులో, కచేరీ గుమాస్తానో అయితే టైము ప్రకారం సరిగ్గా ఇంటికు వచ్చెయ్యవచ్చు. ఒక పెద్ద కంపెనీకి మేనేజర్ అయిన వారు గడియారం చూసుకొని, సాయంత్రం అయిదు గంటలు కాగానే ఇంటికి వచ్చెయ్యాలంటే ఎలా కుదురుకుతుంది?"

"ఎన్నింటికి వస్తారు మరి?"

"వారి రాకపోకలకు ఒక టైమంటూ ఉండదు. అవసరాలను బట్టి వెళుతూ, వస్తూ ఉంటారు."

"అలా అయితే ఆరోగ్యం పాడైపోదూ?"

"అలవాటైపోతుందమ్మా! మొదట్లో నేనూ నీలాగే కంగారు పడేదాన్ని. కాని, పెద్ద జీతం, హోదా, కారు, బంగళా, ఫోను, నౌకర్లు —మరెన్నో సదుపాయాలూ కావాలనుకుంటే ఇలాంటి చిన్న చిన్న విషయాల్ని పట్టించుకోకూడదు. మనకు నచ్చక పోయినా సరే, కొన్నిటికి అలవాటు పడిపోవాలి. నీకు నిద్ర వస్తున్నట్టుంది. వెళ్ళి పడుకో."



### కిటుకు

ఒక అరవైఏళ్ళ ఆసామి పాతికేళ్ళ అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. ఎందుకైనా మంచిదని డాక్టర్ దగ్గరకు వెళ్ళిపరీక్షలు చేయించుకున్నాడు.

ఆసామి : డాక్టర్! నేను మరీ లావుగా కనిపిస్తున్నానా?

డాక్టరు : మీ ఆవిడ వయస్సెంత?

ఆసామి : పాతిక, ముప్పయి ఉండవచ్చు.

డాక్టరు : ఆ అమ్మాయిని ఒకసారి నా దగ్గరకు పంపండి—తర్వాత మీ ప్రశ్నకు సమాధానం వస్తుంది.

"అవునమ్మా! అల్లుడుగారు వచ్చేంతవరకు కూర్చుందా మనుకున్నాను కాని, ఆగలేక పోతున్నాను. ప్రయాణం చేసి వచ్చాం కదా? బడలికగా ఉంది" అంటూ ఆవిడ లేచింది.

"అల్లుడుగారు వచ్చేంతవరకూ నువ్వు కూర్చునే ఉంటావా?" అనుమానంగా అడిగింది కూతుర్ని.

"పది దాటితేనేకాని నాకు నిద్ర పట్టదులే. కాస్సేపు చూసి, రాకపోతే తరవాత పడుకుంటా" అంది వాసంతి.

విశాలమైన ఆ హాల్లో, ఖరీదైన సోఫాలో అస్తిమితంగా కూర్చుని ఉంది వాసంతి. ఆ నిశ్శబ్ద నిశీథిలో సీలింగ్ ఫాన్ చప్పుడే భయంకరంగా వినిపించసాగింది. అయితే, నీరవ నిశీథాలు, నిరీక్షణలు దినచర్యలో ఒక భాగమై పోయిన వాసంతి పంఖా రెక్కల చప్పుళ్ళకు జడవటం ఎప్పుడో మానేసింది. సాధారణంగా ఈ సమయంలో ఏ ఇంగ్లీషు నవలో చదువుతూ కూర్చుంటుంది. ఈ వేళ తల్లీ, చెల్లెలూ రావటంతో కబుర తో ఇంతసేపూ కాలక్షేపమై పోయింది. వాళ్ళిద్దరూ పక్కల మీదికి వెళ్ళిపోవటంతో, తను ఒంటరిదై పోయింది. ఒంటరితనం తనకు కొత్తకాదు. భరించరానిది అంతకన్నా కాదు. ఆ జీవితానికి బాగా అలవాటు పడిపోయింది తను. ఈ వేళ సాయంత్రం తల్లీ, చెల్లీ రావటం, కుటుంబ విషయాలు మాట్లాడుకోవటం, గత స్మృతులు నెమరువేసుకోవటం వగైరా జరిగిన తరవాత ఇప్పుడు ఒంటరితనం కొత్తగా అనిపించసాగింది. ఆ హాల్లో తను ఒక్కతే ఉన్నానన్న 'ఫీలింగ్' ప్రత్యేకంగా కనుపించసాగింది.

షెల్ఫులో కొత్త పుస్తకాలు చాలా ఉన్నాయి. కాని, పుస్తకాల మీదికి బుద్ధి పోవటం లేదు. కాస్సేపు అటూ, ఇటూ పచార్లు చేసి, మళ్ళీ సోఫాలోనే చేరబడింది వాసంతి.

సరిగ్గా సంవత్సరం క్రితం ఎ. అండ్ బి. కంపెనీలో స్టెనోగా చేరింది మిస్ వాసంతి బి. ఎ.

వాసంతి తండ్రి కుటుంబరావుగారు గవర్నమెంటు ఉద్యోగం చేస్తూ, పక్షవాతం వచ్చి నోరూ, చెయ్యీ పడిపోవటంతో, మధ్యంతరంగానే ఉద్యోగ విరమణ చెయ్యవలసి వచ్చింది. ఆయన సంతానం —వాసంతి, ఆమె చెల్లెలు — ఇద్దరే కనక ఆయన ఉద్యోగంలో ఉన్నంత కాలం ఆర్థిక పరమైన ఇబ్బందులు అంతగా ఎరగరనే చెప్పుకోవాలి. వచ్చే జీతంరాళ్ళు ఆగిపోవటంతో ఇబ్బందులు మొదలైనాయి. స్వంత ఇల్లొకటే ఉందికాని, స్థలాలు, పొలాలు లేవు. అప్పటికే డిగ్రీతోబాటు టైపూ, షార్టుహాండూ పాసై ఉంది వాసంతి. అవసరాలను గుర్తించి, తీవ్రంగా ప్రయత్నించి ఉద్యోగం సంపాదించ గలిగింది వాసంతి. కుటుంబాన్ని స్వగ్రామంలో ఉంచి, తను వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్లో ఉండి, పొదుపుగా ఖర్చు చేస్తూ, మిగిలిన జీతం ఇంటికి పంపిస్తూ ఉండేది.

చదువుకునే రోజుల్లో 'ఇండస్ట్రియస్, బ్రిలియంట్ అండ్ మెరిటోరియస్ స్టూడెంట్' వాసంతి.

ఉద్యోగంలో చేరిన తరవాత కొద్ది కాలానికే 'సిన్సియర్ అండ్ వర్క్ మైండెడ్' అనిపించుకుంది.

అసాధారణమైన అందం, అత్యాధునికమైన అలంకరణ, వాచాలత్వం, నాగరికత పేరిట చేసే వెకిలి చేష్టలు వాసంతిలో లేవు.

సాధారణమైన అందం, సంసార పక్షమైన అలంకరణ, మితభాషిత్వం, వయస్సు ప్రసాదించిన సౌకుమార్యం —ఇవీ వాసంతిలో కనుపించే భౌతిక లక్షణాలు.

వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దే నిజాయితీ, సంస్కారం ఆమెలోని ప్రత్యేకతలు.

ఆ కంపెనీలో చాలా మంది 'లేడీస్' పని చేస్తున్నారు. అందంలోనూ, చదువులోనూ, సంపాదనలోనే కాకుండా, సాంఘికంగాకూడా వాసంతి కన్న ఒక మెట్టు పైనేఉన్న యువతులు కొందరు ఉన్నారు వారిలో. కాని, అవివాహితుడైన ఆ కంపెనీ మేనేజర్ మాధవ్ దృష్టి వాసంతి పైనే పడింది.

మంతనాలు, మధ్యవర్తిత్వాలు లేకుండా సూటిగా ఆమె తోనే మాట్లాడి, ఆమె అంగీకారం పొంది, వివాహం చేసుకున్నాడు మాధవ్.

మాధవ్ మంచివాడు. చదువు, సంస్కారం కల వాడు. సంపాదనపరుడూ, స్వతంత్రుడూను. పెళ్ళైన మరునటి రోజే వాసంతిని ఉద్యోగం మాన్పించేసి, ఆమె తలిదండ్రుల్నీ, చెల్లెల్నీ తమ ఇంటికే తీసుకు వచ్చెయ్యమన్నాడు—విశాల హృదయంతో.

ఉద్యోగం వదిలేసింది కాని, తన వారిని తన ఇంటికి తీసుకు రావటానికి ఇష్టపడలేదు వాసంతి— దూరాలోచనతో.

ఆమె నిర్ణయాన్ని కాదనలేదు మాధవ్.

భర్త అనుమతితో అవసరమైన ఆర్థిక సహాయాన్ని ఇక్కడి నుంచే తన వారికి చెయ్యసాగింది వాసంతి.

తలిదండ్రులకు నిశ్చింతగా రోజు గడిచిపోతూంది. చెల్లెలు చదువుకుంటూంది.

మాధవ్‌కు తను భార్య కావటం వాసంతికి ఎలా ఉందంటే బంట్రోతును తీసుకు వెళ్ళి ఆఫీసర్ సీటులో కూర్చోపెట్టి నట్టుంది! లేకపోతే ఈ స్థితినీ ఇంతటి అదృష్టాన్నీ కలలోనైనా ఊహించ గలిగిందా తనెప్పుడైనా? తనెక్కడ? మాధవ్ ఎక్కడ? తన స్థితికీ, మాధవ్ స్థితికీ మధ్య నక్కకూ, నాగలోకానికీ మధ్య ఉన్నంత అంతరం ఉంది. నిన్న మొన్నటి వరకు హాస్టల్లో ఒక చిన్న గదిని మరో అమ్మాయితో పంచుకున్న తను, ఈ వేళ ఒక బంగళాకు అధికారిణి అయింది. ఒక్క బంగళాయేనా? అందమైన తోట, ఇంట్లో ఫోను, ఇంటి నిండా నౌకర్లు, వంట మనిషి, గేటు దగ్గరగూర్ఖా, తిరగటానికి కారు, బోలెడంత స్థిరాస్తి, బాంకు ఎకౌంటు, నెలసరి ఆదాయం, హోదా, ముద్దుగా పెంచుకోవటానికి విదేశీ బొచ్చు కుక్కపిల్ల—ఇంకా ఎన్నో- తనకు పేర్లైనా సరిగా తెలియని అధునాతనమైన ఎంతో సరంజామా ఈ బంగళాలో అమర్చబడి ఉంది. వాటి ఖరీదులు వింటేనే తనకు గుండె ఆగినంత పని అయింది. తను పుట్టి పెరిగిన వాతావరణం మధ్యతరగతికి సంబంధించినది. తన స్నేహితుల్లో కూడా ఇంతటి స్థితిమంతు లెవ్వరూ లేరు. సినిమా సెట్టింగులా అత్యంత

# శృంగార నాయికలు

## ఖండిత

-చంద్రం

వైభవంగా ఉన్న ఈ బంగళాలో తొలిసారిగా అడుగు పెట్టినప్పుడు 'కలయో వైష్ణవమాయయో' అన్నట్టయిపోయింది తన పరిస్థితి. తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, పరిచయస్థులు, అయిన వాళ్ళు, కాని వాళ్ళు అందరూ వేనోళ్ళ తన అదృష్టాన్ని అభినందించారు. అసూయ పడ్డ వాళ్ళూ ఉన్నారు. తన మట్టుకు తాను ఈ వాతావరణంలో ఇమడటానికి ఎంతో కష్టపడవలసి వచ్చింది. ఈ ఇంటిలో ప్రవేశించి ఆరు నెలలు కావస్తున్నా, ఇప్పటికీ కొన్ని విషయాల్లో కొత్తదనం ఫీలవుతూంది తను.

తిరుమల కొండపైన, శ్రీనివాసుని సన్నిధిలో వైభవోపేతంగా జరిగింది తమ వివాహం. ఖర్చంతా మాధవ్‌దేనని వేరే చెప్పనక్కర్లేదు కదా!



వివాహం అయిన తరవాత రెండు మూడు సార్లు తను పుట్టింటికి వెళ్ళి వచ్చింది. తన పుట్టింటి వాళ్ళు ఇక్కడికి రావటం ఇదే ప్రథమం.

అనారోగ్యం వల్ల తండ్రి ఎలాగూ ఇల్లు వదలి రాడు. కనీసం తల్లీ, చెల్లెలూ అయినా వచ్చినందుకు ఎంతగానో సంతోషించింది వాసంతి.

వేసవి సెలవులు ఉన్నన్నాళ్ళూ ఇక్కడే గడపాలని ఉబలాటపడింది వాసంతి చెల్లెలు. అందు కామె తల్లి అంగీకరించలేదు.

అక్కడ రోగిష్టి తండ్రి బాధ్యత వేలు విడిచిన మేనత్తకు అప్పగించి వచ్చారు వీళ్ళు. అందుకని ఎక్కువ రోజులు ఉండమని తల్లిని బలవంతం చెయ్యలేకపోయింది వాసంతి. చెల్లెలి ఉత్సాహం చూసి, "పోనీ, దీన్ని ఇక్కడ ఉంచి నువ్వు వెళ్ళమ్మా; సెలవులు అయిపోయే ముందు నేను పంపిస్తాను" అంది.

"వద్దులే, అమ్మా. ఇద్దరం కలిసే వెళ్ళిపోతాం, నాలుగు రోజులు ఉండి. ఇది లేకపోతే అక్కడ నా కొక్కదానికీ ఏమీ తోచదు" అనేసింది ఆమె తల్లి.

"ఈ నాలుగు రోజుల్లోనైనా ఈ సిటీలో చూడ దగ్గ వింతలూ, విశేషాలూ చూపించెయ్యి, అక్కా!" అంది చెల్లెలు.

"అలాగే లేవే. మీ బావగారితో కారు ఉంచమని చెపుతా."

సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో వచ్చారు వీళ్ళు.

అల్లుడుగారిని చూడాలని తల్లీ, బావగారిని చూడాలని చెల్లెలూ ఇంతసేపూ ఎదురు చూశారు. కాని, వాళ్ళ కోరిక నెరవేరలేదు.

గడియారం పది కొట్టింది.

ఒకసారి కళ్ళు తెరిచి చూసింది వాసంతి. నిద్ర పట్టటం లేదు. అయినా, సోఫాలోనే ఉండి కళ్ళు మూసుకుంది. పాత విషయాలు గుర్తు చేసుకో సాగింది.

వివాహం అయిన తరవాత ఒక నెల రోజులు సెలవు పెట్టి 'హనీమూన్' పేరుతో దేశమంతా తిప్పి, ఎన్నో ముఖ్యమైన ప్రదేశాలు చూపించాడు మాధవ్, వాసంతికి. ఆమెతో స్నేహంగా ప్రవర్తించి, భయాన్ని పోగొట్టి, దగ్గర కావాలని ప్రయత్నించాడు. మనసు విప్పి తన అలవాట్లూ, అభిరుచులూ, బల హీనతలూ — అన్నీ చెప్పుకువచ్చాడు. వాసంతిని చెప్ప మని బలవంత పెట్టలేదు. చెప్పినమట్టుకు విన్నాడు. అంతే. తమ ఇద్దరి మధ్య ఎలాంటి అరమరికలూ, అంతరాలూ ఉండకూడదనీ, సదవగాహన ఏర్పడాలనీ, ముఖ్యంగా వాసంతిని తన స్థాయికి తీసుకురావాలనీ ఈ నెల్లాళ్ళూ తీవ్రంగా కృషి చేశాడు మాధవ్. అతని కృషి పూర్తిగా ఫలించలేదనే చెప్పాలి.

వాసంతి పుట్టిందీ, పెరిగిందీ మధ్యతరగతి సమాజంలో. ఆమెకు తెలిసిన సాంఘిక ధర్మాలు, నీతి నియమాలు, కట్టుబాట్లు మధ్య తరగతికి సంబంధించినవి. ఆమెది మధ్య తరగతి మనస్తత్వం.

మాధవ్ పుట్టి పెరిగి, తిరుగుతున్నది హైక్లాస్ సొసైటీ. అతని భావాలూ, ప్రవర్తనా అందుకు అనుగుణంగా ఉండటంలో ఆశ్చర్యమేమీ లేదు.

మాధవ్, వాసంతి — ఇద్దరూ రెండు విభిన్న వర్గాలకు చెందిన వారు. ఇద్దరి మధ్య ఆర్థికంగానూ, సాంఘికంగానూ ఎంతో వ్యత్యాసం ఉంటుంది. ఇక్కడి సాంఘిక నియమావళి వేరు. అక్కడి సాంఘిక నియమావళి వేరు. సమస్య ఒకటే అయినా దాన్ని పరిష్కరించే దృష్టి, పరిశీలించే దృక్పథం, పరిష్కరించే విధానం వేర్వేరుగా ఉంటాయి.

మాధవ్ తాగుతాడు — ఉత్సాహంకోసం. జూదమాడుతాడు — కాలక్షేపంకోసం. పరస్త్రీలతో తిరుగుతాడు — థ్రిల్‌కోసం. అతను తిరుగుతున్న సొసైటీలో వాటికి అంతగా పట్టింపులేక పోవచ్చు. కాని, వాసంతి దృష్టిలో అలా కాదు కదా? క్లబ్బుల్లోనూ, పార్టీల్లోనూ స్త్రీ పురుషులు విచ్చలవిడిగా, విచక్షణారహితంగా ప్రవర్తిస్తారన్న వూహే ఆమె భరించలేకపోతూంది. వివాహ బంధాన్ని పవిత్రంగా భావించి, ప్రాణప్రదంగా కాపాడుకొనే మధ్య తరగతి మనస్తత్వం గల ఆమె, తన భర్త పరస్త్రీలతో తిరుగుతున్నాడన్న సత్యాన్ని ఎలా సమర్థించ గలదు? పాతివ్రత్యంతోబాటు పత్నీవ్రతం కూడా కొనసాగి నప్పుడే వివాహ బంధం ఉద్దేశం నెరవేరుతుందని ఆమె నమ్మిక.

వాసంతిని తన మార్గంలోకి తిప్పుకోవాలన్న మాధవ్ ప్రయత్నాలు ఫలించలేదు. "సరే, నీ ఇష్టం. నీకు నచ్చని పనులు చెయ్యమని నిన్ను బలవంతం చెయ్యటం నా సిద్ధాంతానికి విరుద్ధం. నీకు నమ్మకం జన మనిపించిన పద్ధతినే నువ్వు అనుసరించు" అని భార్యను వదిలేశాడు మాధవ్. తనుమాత్రం తన పాత అలవాట్లను మార్చుకోలేదు. మార్చుకోవటానికి ప్రయత్నించనే లేదు.

వర్గపరమైన లక్షణాలేకాని, వ్యక్తిగతమైన అవలక్షణాలు లేవు మాధవ్‌లో. అందుకనే అతనిపట్ల సదభిప్రాయం చెదిరిపోలేదు వాసంతికి.

తన పద్ధతులు సరి అయినవే నని మాధవ్ ఉద్దేశ్యం. భార్యపైన ఎలాంటి ఆంక్షలూ విధించ లేదు. పూర్తి స్వాతంత్ర్యం ఇచ్చాడు. తన అలవాట్లను మార్చుకోకపోయినా, వాటి మూలంగా భార్యను నిర్లక్ష్యం చెయ్యటం జరగలేదు.

అన్ని విధాలా అనుకూలుడైన భర్తను, పాత పద్ధతులు మార్చుకోలేదన్న కారణం చేత వదులు కొనేటంత మూర్ఖురాలు కాదు వాసంతి. బాగా ఆలోచించి, తనే సర్దుకు పోవాలని నిశ్చయించు కుంది. సర్దుకుపోతూంది. కాని, మధ్య మధ్య తన మధ్య తరగతి మనస్తత్త్వం బయటపడి, మనస్తాపం కలిగిస్తూ ఉంటుంది.

తన భర్త అలవాట్లు గురించి తెలిస్తే తల్లీ, చెల్లీ ఎంతో బాధపడతారు. అందుకనే అంత రాత్రి వరకు ఆఫీసు పనిలోనే ఉంటారని అబద్ధం చెప్పింది. నిజం ఏమిటంటే — అయిదు గంటల తరవాత ఆత నెప్పుడూ ఆఫీసు ఆవరణలో ఉండడం జరగదు.

ఆలోచనల మధ్య ఎప్పుడు కునుకు పట్టిందో తెలియదు. కాని, కారు హారన్ విని, త్రుళ్ళిపడి కళ్ళు తెరిచింది వాసంతి.

గోడ గడియారం నాలుగు గంటలు అయిదు, విశేషాలు చూపిస్తూంది.

"ఇంకా నిద్రపోలేదా, డియర్?"

"అమ్మా, చెల్లీ వచ్చారు."

"అవునవును. సాయంత్రం ఫోను చేసి చెప్పావు కదూ?"

"పెందలాడే వస్తారనుకున్నాను."

"సారీ, వసూ! వద్దామనుకున్నాను కాని, కుదర లేదు. వాళ్ళు పడుకుండిపోయారా?"

"తెల్లవారపోతూంటే ఇంకా కూర్చుని ఉండ మంటారా? వాళ్ళిక్కడ నాలుగు రోజులు ఉంటారు. ఈ నాలుగు రోజులూ మీరు కాస్త వేళకు ఇంటికి వచ్చేస్తూండాలి."

"ఓ కే."

"మీ కారు కూడా 'స్పేర్' చెయ్యాలి."

"ష్యూర్, ష్యూర్."

"భోజనం చేస్తారా?"

"చేసే వచ్చా."

"ఒక గ్లాసుడు మజ్జిగ తాగండి."

---

అబద్ధాలాడడం వల్ల సాధించ గలిగిందల్లా - నిజం పలికినప్పుడు కూడా ఎవరూ నమ్మకపోవడం.

—అరిస్టాటిల్

---

మజ్జిగ గ్లాసు తెచ్చి ఇచ్చి, బూట్లూ, మేజోళ్ళూ విప్పసాగింది వాసంతి.

భర్త ఏ వేళప్పుడు ఇల్లు చేరినా, స్వయంగా సేవలు చెయ్యాలనుకోవటం కూడా మధ్య తరగతి స్త్రీ మనస్తత్త్వమేనేమో!

తను సంభాషణ విని తల్లీ, చెల్లీ ఎక్కడ లేచి పోతారో నని తెగ భయపడిపోయింది వాసంతి. ఈయన నాలుగు గంటలకు వచ్చారని తెలిస్తే, రేపు మళ్ళీ నిగ్గదీస్తుంది తల్లి. అందుకనే సంభాషణ క్లుప్తంగా ముగించి, నిద్రకు ఉపక్రమించింది వాసంతి.

**(ప్రియుడు పరకాంతతో రేయి గడిపి, ఉదయానికి ఇంటికి రాగా బాధపడే నాయిక -ఖండిత.)**

## వచ్చే వారం శృంగార నాయిక- కలహాంతరిత